# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 25-07-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితిపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శ్వేతపత్రాన్ని శాసన సభలో ఈరోజు విడుదల చేయనున్నారు.**

**2.** **రాష్ట్రంలో అసాంఘిక శక్తులు, మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడానికి ప్రభుత్వం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసిందని హోం శాఖ మంత్రి వి. అనిత తెలిపారు.**

**3.** **రాష్ట్రంలో నీటి ప్రాజెక్టుల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.**

**4.** **టిడ్కో గృహాలను వచ్చే డిసెంబర్ నెలలోగా పూర్తి చేస్తామని పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు.**

**5.** **విజయవాడ నగరంలో ప్రతి నిత్యం సురక్షితమైన తాగునీటిని సరఫరా చేయాలని నగర పాలక సంస్థ ఇన్చార్జి కమిషనర్ ఏ.మహేష్ అధికారులను ఆదేశించారు.**

==========================

రాష్ట్ర శాసనసభ సమావేశాలు నాల్గవరోజు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఈరోజు ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు ప్రశ్నోత్తరాలు కొనసాగాయి. పలువురు శాసన సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రులు సమాధానాలిచ్చారు. అనంతరం రాష్ట్ర శాసన సభ మాజీ సభ్యులు పి.వెంకటకృష్ణారావు, వై.సీతాదేవి, ఎస్.బుల్లబ్బాయ్, ఎస్.వెంకటరెడ్డిల మృతికి సంతాపాన్ని ప్రకటించారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితిపై ముఖ్యమంత్రి  నారా చంద్రబాబు నాయుడు శ్వేతపత్రాన్ని శాసన సభలో విడుదల చేస్తారని శాసనసభాపతి అయ్యన్నపాత్రుడు వెల్లడించారు.

-------------------------

రాష్ట్రంలో అసాంఘిక శక్తులు, మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడానికి ప్రభుత్వం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసిందని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. రాష్ట్రంలో నేరాలకు పాల్పడే వారిని నియంత్రించే అంశంపై శాసన సభలో ఈరోజు పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి  సమాధానం చెబుతూ, అసాంఘిక శక్తుల కార్యకలాపాలు నియంత్రించడం కోసం ఒక ప్రత్యేక కార్యాచరణ రూపొందించడం జరిగిందని చెప్పారు. నేరాలకు పాల్పడే వారిపై పోలీసులు పి.డి.యాక్టు, ఇతర కేసులు కూడా నమోదు చేస్తున్నారని తెలిపారు. ఈ తరహా నేరాలను అదుపు చేయడానికి సామాజిక చైతన్యం తీసుకు వచ్చే కార్యక్రమాలను కూడా

నిర్వహిస్తున్నామని మంత్రి వివరిస్తూ,...

వాయిస్ (23 సెకన్లు )

---------------------------

రాష్ట్రంలో నీటి ప్రాజెక్టుల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. శాసన సభ సమావేశాల్లో భాగంగా ఈరోజు రాష్ట్రంలో చేపట్టిన నీటి ప్రాజెక్టుల పురోగతిపై పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిస్తూ...

..వాయిస్...

---------------------------

రాష్ట్రంలో 2014 – 19 సంవత్సర మధ్య కాలంలో తెలుగు దేశం ప్రభుత్వ హయాంలో పేదల కోసం ప్రతిపాదించిన టిడ్కో గృహాలను వచ్చే డిసెంబర్ నెలలోగా పూర్తి చేస్తామని పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు. టిడ్కో గృహాల నిర్మాణంపై శాసన సభలో ఈరోజు పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం చెబుతూ..... రాజధాని అమరావతి నిర్మాణం సమయంలో దేశ విదేశాలలో పర్యటించిన సందర్భంలో అక్కడి పరిస్థితులను అధ్యయనం చేసి రాష్ట్రంలో కూడా పేదలకు గృహ వసతి కల్పించాలన్న లక్ష్యంతో ఈ గృహాల నిర్మాణ కార్యక్రమాన్ని తల పెట్టామని వివరించారు. 7 లక్షల ఒక వెయ్యి గృహాల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అనుమతించిందని, వీటిలో మూడు లక్షల గృహాలకు అప్పుడు టెండర్లు పిలిచామని, ఇవి వివిధ దశలలో నిర్మాణంలో వున్నాయని, 75 శాతంపైగా పూర్తయిన గృహాలను వచ్చే డిసెంబర్ లోగా పూర్తి చేస్తామని మంత్రి నారాయణ ప్రకటించారు.

---------------------------

రాష్ట్ర మంత్రివర్గం ఈరోజు సమావేశమవుతుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఈ మధ్యాహ్నం సచివాలయంలో ఈ సమావేశం జరుగుతుంది. ఈ సందర్భంగా బడ్జెట్ ఆర్డినెన్స్‌తో పాటు పలు అంశాలపై మంత్రి వర్గం చర్చించనుంది. అలాగే పోలవరం ప్రాజెక్టు డయాఫ్రం వాల్ నిర్మాణంపై మంత్రివర్గ తీర్మానం కావాలని కేంద్రం కోరడంతో ఈ అంశంపై తీర్మానం చేయనున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

ఇలా ఉండగా... రేపు శాసనసభలో ఆర్థిక శాఖపై రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయనుంది. నీటి పారుదల శాఖ, పోలవరం బిల్లులు భారీగా పెండింగ్‌లో ఉన్నట్లు చెప్పింది. వీటికి సంబంధించిన పూర్తి వివరాలు శ్వేతపత్రంలో వెల్లడించనుంది.

---------------------------

అగ్నిప్రమాదం నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా రెవెన్యూ కార్యాలయాల భద్రతకు భూ పరిపాలనా ప్రధాన కమిషనరేట్–సీసీఎల్ఏ ఆదేశాలు జారీ చేసింది. తహసీల్దార్, ఆర్డీఓ, సబ్ కలెక్టర్ కార్యాలయాలతో పాటు కలెక్టరేట్ల వద్ద 24 గంటలూ భద్రతా పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించింది. కంప్యూటర్లలోని సమాచారాన్ని ఒకే చోట ఉంచకుండా మరికొన్ని చోట్ల భద్రపర్చాలని తెలిపింది. దస్త్రాలను నిల్వ చేసే గదుల్లో అగ్ని ప్రమాదాల నిరోధానికి చర్యలు తీసుకోవాలని.. ముఖ్యమైన రికార్డులు, రిజిస్టర్లు, అడంగల్, 1బీ, ఆర్ఎస్ఆర్‌లాంటి వాటిని సురక్షిత ప్రాంతాల్లో ఉంచాలని పేర్కొంది.

---------------------------

రాష్ట్రంలో చేనేత రంగానికి పూర్వ వైభవం తెచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర బీసీ, జౌళి శాఖా మంత్రి ఎస్.సవిత అన్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో చేనేత కార్మిక సంఘాల నాయకులతో మంత్రి సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతి చేనేత కార్మికుడికీ పని కల్పించాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. వచ్చే నెల ఏడో తేదీన విజయవాడలో జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చేనేత ప్రదర్శనను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ప్రదర్శనలో చేనేత కార్మికులు స్టాళ్లు ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు.

---------------------------

పర్యావరణ పరిరక్షణకు చెట్లు దోహదం చేస్తాయని కేంద్ర సమాచార ప్రసారాల మంత్రిత్వ శాఖ క్షేత్ర ప్రచార అధికారి పరవస్తు నాగ సాయి సూరి అన్నారు. ఏక్ పేడ్ మా కే నామ్ కార్యక్రమంలో భాగంగా నెల్లూరులోని ప్రభుత్వ పాఠశాలలలో వన మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి  నరేంద్రమోదీ పర్యావణానికి మేలు చేసే విధంగా ఏక్ పేడ్ మా కే నామ్ కార్యక్రమానికి పిలుపునిచ్చారన్నారు.  ప్రతి ఒక్కరూ  తమ తల్లి పేరుతో ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని తెలిపారు. నెల్లూరులోని అన్ని నగరపాలక సంస్థ పాఠశాలల్లో  ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని పేర్కొన్నారు.

---------------------------

విజయవాడ నగరంలో  ప్రతి నిత్యం సురక్షితమైన తాగునీటిని సరఫరా చేయాలని నగర పాలక సంస్థ ఇన్చార్జి కమిషనర్ ఏ.మహేష్ అధికారులను ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా  పలు ప్రాంతాల్లోని నీటి నిల్వ  ట్యాంక్ లను సందర్శించారు. ఈసంద ర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ప్రజలకు శుద్ధమైన, సురక్షితమైన తాగునీటిని అందించేందుకు, విజయవాడ నగర పాలక సంస్థ ప్రతి నిత్యం నీటి పరీక్షలు చేస్తోందన్నారు. తాగునీటి పరీక్షల్లో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలుంటాయని చెప్పారు.

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎం.వెంకట్రావు కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ  కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

.....వాయిస్.... 25  సెకన్లు....

అల్లూరి సీతారామరాజు జిల్లాలో  వర్షాలు కురుస్తున్న క్రమంలో ఈరోజు కూడా  విద్యాసంస్థలకు  జిల్లా కలెక్టర్ ఏ.ఎస్ .దినేష్ కుమార్ సెలవు ప్రకటించారు. తూర్పు గోదావరి జిల్లా  రాజమహేంద్రవరం ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద 13.80 అడుగుల నీటిమట్టం ఉండగా, 12 లక్షల 81 వేల 504 క్యూసెక్కుల జలాలను అధికారులు దిగువకు విడుదల చేశారు. అలాగే జూరాల జలాశయం నుంచి శ్రీశైలం జలాశయానికి  లక్షా 93 వేల 803 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరడంతో  31 వేల 784 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు.

---------------------------

పని ప్రదేశాల్లో మహిళలు, పిల్లలపై జరిగే నేరాల నిరోధానికి కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న నూతన నేర చట్టాలపై ప్రతి మహిళా అవగాహన కలిగి ఉండాలని  సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం –ఐసీడీఎస్ అనకాపల్లి జిల్లా డైరెక్టర్ అనంతలక్ష్మి అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మిషన్ శక్తి వందరోజుల కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని తుమ్మపాల మండలం కోడూరు, గొలగాం గ్రామాల్లో పర్యటించి మహిళలకు అవగాహన

సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత నెల 21న ప్రారంభమైన మిషన్ శక్తి కార్యక్రమం అక్టోబర్ 4 వరకు వంద రోజుల పాటు ప్రతి పల్లెలో జరుగుతుందన్నారు. నూతన నేర చట్టాలలో మహిళా చట్టాలపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు.

---------------------------

ఆధార్ ప్రత్యేక శిబిరాలను ప్రజలు వినియోగించుకోవాలని శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కోరారు. నిన్న శ్రీకాకుళంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఆధార్ ప్రత్యేక శిబిరాలను ఈనెల 27వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. 5 ఏళ్లలోపు వారికి కొత్తగా బాల ఆధార్ ను నమోదు చేయాలన్నారు. అలాగే గత 10 సంవత్సరాల కాలంలో ఆధార్ కార్డ్ లో వివరాలను ఆధార్ ప్రత్యేక శిబిరాలను వినియోగించుకొని నవీకరణ చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్” మనసులోని మాట కార్యక్రమం 112వ సంచిక ఈనెల 28వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. “మన్ కీ బాత్” కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు రేపు సాయంకాలం వరకు పంపవచ్చు.

=======================